


# సోమయాజి అయాడు

శ్రీ ఈమని సీతారామ్

అగ్రహారంలో కామావధానులుగారని అవధానంచేసిన గ్రామపెద్ద ఒకడున్నాడు. ఈయనకు బారసాలచేసి తల్లీ తండ్రీ ఓ వందరూపాయిలు ఖర్చుపెట్టి బియ్యంలో వుంగరంతో తిథి, వారం, నక్షత్రం అన్నీ చూచి పదిమంది అగ్రహారకుల ఎదుట వ్రాసిన అసలు పేరు కామన్న. తరువాత కామన్న పెద్దవాడయినాక ముప్పదియోయేట ఓ ఏడేళ్ళ పెద్దమ్మాయిని పెళ్లాడి నలభయ్యోయేట అవధానంచేసి కామావధాను లనే పేరుపెట్టుకొన్నాడు. పాపం, ఆ అవధానంచేసి ఆరునెలలు తిరుగాయో లేదో ఆ అమ్మాయి క్షుద్ర ప్రాణం కాస్తా గుటుక్కుమంది. ఆ తరువాత అవధానులుగారు 1200 కన్యాసుల్కం యిచ్చి 12 ఏండ్లమ్మాయిని పెండ్లాడాడు. ఆ అమ్మాయి కాపురానికి వచ్చాక అవధానం ఎల్లాగయినా చేశాము గనుక యజ్ఞం కాస్తా అయిందనిపించి సోమయాజి నవుదామనే సంగతి సంకల్పించుకొన్నాడు. అనుకొన్నాడో లేదో రెండో భార్యకూడా సవితిని వెతుక్కుంటూ వెళ్లిపోయింది. పాపం ఈయన మాత్రం ఏమిచేస్తాడు? భార్యలేకుండా ఒక్కడూ యజ్ఞం చేయకూడదు కదూ? శ్రీరాముడే సీతను వనవాసానికి పంపించి, కనకపు సీతను ప్రక్కన పెట్టుకొని మరీ యశ్వమేధ యాగం చేశాడు. శ్రీరాముడు మహారాజు గనుక అసలు సీత లేకపోతే బంగారపు సీతను చేయించుకొన్నాడు. కాని మన పిచ్చిపారుడు ఏమి చేయగలడు? ఉత్తి అవధ్యుడు. అందుచేత మాట మళ్లీంట్టి ఇంకో పంద్రెండు వందలు బొడ్డున ముడిచి అరవయ్యోపడి దొరబడ్డాక కళత్రాన్వేషణార్థం బయలుదేరాడు. ధనం ఎంతపనైనా చేస్తుందికదూ! కొండమీది కోతిని క్రిందకు తెస్తుంది. ఇంకో అగ్రహారంలో యింకో అమ్మాయిని కట్టుకొన్నాడు. కట్టుకొనగానే సరా! మరి తలపెట్టిన యజ్ఞం కాస్తా కానిస్తేనే కాని ఆయనకు నిద్రపట్టలేదు. చేతిలోవున్న కిలం కాస్తా అయిపోయింది పెళ్లిళ్లతో. ఏమిచేస్తాడు—ఏముంది—ఇంక బిచ్చం. ముష్టి ఎత్తుకోవటం బ్రాహ్మడికి జన్మహక్కని పరాశరులువారు వ్రాశారంటో బయలుదేరాడు దేశాలమ్మట చెంబుతోముకొని.

ఈ అరవయ్యోపడిలో మన అవధానులుగారు ఎల్లా వుంటారో ఎరుగుదురా?

విచిత్రంఅయిన ఆదోరకపు వింతమనిషి. వీధమ్మట వెడుతూవుంటే జనులందరూకూడ ఏదో వింతమృగాన్ని చూచినట్టుగా ఆయన్నే చూస్తూవుంటారు ఆదేమికర్మమోగాని. ఉత్తి అడివి. ఆ బోసినోరు, దశావతారములలో శ్రీకృష్ణావతారఘట్టంలో గోపబాలకుడువలె 'గుండ్రబొజ్జయు, నొకపాటి గుజ్జురూపు' గలిగి కుజ్జ విష్ణు మహావర్ధను డల్లా వుంటాడంటే నమ్మండి. బిళ్లగోచీ బిగించి లంజకట్టు కట్టుకొని గోష్పాదమంత పిలకా చివర ముడేసి అందులో ఒక నందివర్ధనంపువ్వు జొనిపి, మిగిలిన బుర్ర సున్నగా పొన్నకాయిలా గొరిగించి బుర్రమీద ముఖంమీద విభూతి పిండికట్లు పెట్టుకొని, ఓ భుజంమీద అంగవస్త్రం, ఇంకో భుజంమీద శాలువా, చెవులలో తంతివలె పొడుంబుర్రా, మెడలో రుద్రాక్ష

మాలా, వేసికొని చెవుల కుండనాలు వూగులాడుతూ వుండగా చేతిలో తెల్లగా తోముకొన్న చెంబు పట్టుకొని దేహీ! అంటో ఎక్కేగుమ్మం, దిగేగుమ్మం. వెయ్యిళ్ల పూజారత్వం నడుపుతూవుంటే ఆయన విగ్రహాన్ని కళ్లారా చూస్తేగాని నేను దూరం వ్రాయటం అంత మజాగా వుండదు. పొట్టకోసి కంచుకాగడాలతోటి తెగవెతికినా ఒక అక్కరమైనా మచ్చుకు కనబడదు. అసలు కేసవనామా లయినా వరుసతప్పకుండా కంఠస్థమనటంకూడ నా కనుమానమే. ఇటువంటి అవధానులుగారు దేశాలమ్మట తిరిగి అయినవాడిని, కానివాడిని, కడుపూ, కాళ్లూ పట్టుకొని ఓ నాలుగేళ్లకు ఓ నాలుగువేల రూపాయీలు మూటకట్టుకొని పడుచుపెళ్లాం సంతోషం నిండునట్లుగా గృహ మలంకరించారు.

ఆ మరునాడే పొరుగూళ్లనుంచి పేరుపొందిన సిద్ధాంతుల నందరిని పిలిపించి ముహూర్తం పెట్టించారు మొట్టమొదట శంకుస్థాపనకు, తరువాత యజ్ఞారంభానికీని. నీరు అందుబాటులో వున్న ఓ కాలువగట్టును ఆనుకొనివున్న పొలంలో వేయించారు తాటాకులపాకలు పందిర్లూను. యజ్ఞంజరిగే ఆ అయిదు రోజులు క్రమంగా బలివేయటానికి యాగపశువులని 12 నల్లమేకలను కొన్నారు అవి చేసికొన్న పుణ్యం ఏమిటోగాని. అక్కడక్కడ వున్నటువంటి తెల్ల వెంట్రుకలన్నిటినీ పీకేశారు. యజ్ఞం రేపనగా ఒక కుమ్మవాడిని మాట్లాడారు మేకలను చంపటానికి నవరంధ్రాలూమూసి. ఫలానా ఏటిగట్టు అగ్రహారంలో కామావధానులుగారు అమావాశ్య వెళ్లిన పాడ్యమినాడు లగాయతు యజ్ఞం చేస్తారని దేశంలోవున్న ప్రతి పల్లెకూ, పట్టణానికి ప్రాకిపోయింది కార్చిచ్చులాగ. యజ్ఞం అయిదురోజులూకూడ యిసుక వేసినా రాలకుండా వున్నారు జనం, తీర్థ ప్రజ. చాలా మంది ప్రజలు మూగిపోయారు. ఇరువది ముప్పది ఏబది మైళ్లనుంచి వచ్చారు జనం యజ్ఞంచూసి పుణ్యం కొస్తా మూటగట్టుకు పోదామని. సోమయాజులుగారు, సోమిదేవమ్మగారు దీక్షావస్త్రాలు కట్టుకొని దీక్షలో వున్నారు. దేశంలో పేరు మ్రోగిన కర్మిష్ఠులందరూ కాకుల్లాగ మూగారు. వశిష్ఠులవారు పీఠంమీద కూర్చున్నారు. అగ్నిహోత్రాలు ప్రజ్వరిల్లిపోతున్నాయి, పాక లంటుకొంటాయేమోనని భయంవేసింది ప్రక్కనున్న వాళ్లందరికిని. యజ్ఞస్థంభానికి మంత్రాలుచదివి స్నానంచేయించి మెడకు వేపమండ కట్టి నుదుటికి పసుపు కుంకుమ అద్దిన యాగపశువును కట్టారు. మంత్రాలు వూరికే చెవులు చిల్లులుపడేటట్టు చదివేస్తున్నారు. మేకకు నవరంధ్రాలూ మూసివేస్తున్నారు. మేక గిజగిజా కొట్టుకొంటూవుంది. పాపం! 'మే' అని అరుస్తోంది. ప్రక్కనున్న మేకలన్ని కంగారుగా భయంతో ఆపాదమస్తకం వణికిపోతూ కొట్టుకొంటున్నాయి. అక్కడున్న తెలివిగల పెద్దలందరూ ఆ నోరులేని జంతువుల్ని అదమాయించుతూవున్నారు. నవరంధ్రాలు మూయటంవల్ల ఆ మేక ప్రాణాలు అయిదూ ఆకాశంలో కలిసిపోయాయి. మేక చలనంలేక నేలపై పడింది. ఇట్లా అన్ని మేకలు ఒకేవిధమైన అదృష్టాన్ని పంచుకొన్నాయి. వపలుతీశారు. తొమ్మండుగురు వశిష్ఠులు మంత్రాలు చదువుతూ ఒక్కొక్క అంగంచొప్పున హోమంచేయుటం ప్రారంభించారు. ఈ విషాదాంతకమైన విషయాన్ని చూచిన జాలిగుండెగల ప్రతి వ్యక్తికూడ కళ్లమ్మట నీరుకార్చటం మానలేదు.

యజ్ఞానికి వచ్చిన తీర్థప్రజ యావత్తుకూ అవధానులుగారు మూడుపూటలూ పిండివంటలతో సహా భోజన సదుపాయాలు కల్పించారు. నానా వర్ణములవారూ వుదయమేవచ్చి యజ్ఞం చూసుకు భోజనంచేసి పుణ్యం మూటకట్టుకొని సాయంత్రం యింటికి పోతూవుండేవారు. ఇట్లా అయిదురోజులయింది. జనప్రవాహానికి మాత్రం ఏమియు తరుగులేకుండా వుంది. యజ్ఞపాయసం వండారు. అమాయికపుమూక యావత్తూ అనగా, పిల్లలు లేనివాళ్లు, గ్రహబాధలు, యీతిబాధలు గలవాళ్లు, పుణ్యంకోసం దేవుళ్లాడేవాళ్లు తలకో పావులా యిచ్చి ఓ గుక్కెడు పాయసం త్రాగి సోమయాజులుగారి పరవాన్నం నందికేషుడినోము అయిందనిపించారు. అయిదోరోజు వుదయం ఆ యాగస్థలంలో వేసిన పందిళ్లూ, పాకలు పరశురామప్రీతి చేయించారు.

ఎల్లాగయితేనేమి కామావధానులుగారు యజ్ఞంచేసి కామన్న సోమయాజిగారయ్యారు. వారి భార్య సోమిదేవమ్మగారయ్యారు. యజ్ఞదీక్ష ముగిసింది. ఇద్దరూ దీక్ష

లోవుండి యేదిక్కూ చూడకుండా మొట్టమొదట స్మశానంవైపునకు నడిచి ఆ దిక్కు చూశారు. కొందరు యువకులు ఆయన ఎల్లప్పుడూ బుట్టలు కొల్చటం నిత్యాగ్నిహోత్రాలు చెయ్యటం కొదా అంటారు. ఏలాగయితేనేమి సోమయాజులుగారు యజ్ఞం ఐన పదిహేనురోజులకు మూడువేల రూపాయలు పెట్టి నాలుగు ఎకరాల మాగాణి కొన్నారని మామూలు తీసికొని రిజిష్టరీ చేసిన సబురిజిష్ట్రారు చెప్పగా విన్నామని అగ్రహారంలోవున్న కోతులమూకంతా చెప్పుకున్నారు. యజ్ఞం అయ్యాక కూడ ఆ చుట్టుప్రక్కల వాళ్లు కథలుగా చెప్పుకుంటున్నారు 'సోమయాజులు యజ్ఞాలు.' వాటిని గురించి.

'నోరెరుగని యిన్ని మేకలను జీవహింసచేసి యీ ముసలిముండాకొడుకు ఏమి కట్టుకు వెడతాడురా!' అన్నాడు—ఓ. బౌద్ధుడు.

'యజ్ఞంచెయ్యటం రంభాసంభోగానికి కాదంటరో డీ'! అన్నాడో వేడినెత్తురు పారుతూవున్న రసికాగ్రేసర చక్రవర్తి.

''షీ, షీ, కాటికి కాళ్లుజాపుకున్న యీ అరవై ఏండ్ల ముసలాడికికూడా చచ్చాక రంభా సంభోగానికి ఆశచావలేదు, అందుకేచచ్చినా వ్యభిచారంమీది వ్యసనం నాశనం అవదంటారు పెద్దలని' జవాబిచ్చాడు ఓ. అనుభవశాలి.

'యజ్ఞదీక్షలోనుండి లేచిన తక్షణం సోమయాజులుగారు, సోమిదేవమ్మగారు ఏదిక్కు చూస్తే ఆ యేడు అరిష్టాలు సంభవిస్తాయి. అందుకే మొట్టమొదట స్మశానం చూశా' రన్నాడు సోమయాజులగారి మేనల్లుడు.

'అవునురా! అయితే యీ ఏడు తెరిపిలేకుండా వల్లకాడు కొలుతోనే వుంటుందిరా' అన్నాడు హాస్యప్రియుడు గోపాలం.

'ఈ యజ్ఞాలు, యాగాలు వట్టి డాంబికం పెద్దపెద్ద సంభావనలకూ, ఉర్లాం పట్టాలకోసం తప్పితే ఎందుకూ పనికిరావు. చాలా పాపం మూటగట్టుకొన్నాడు యీ సోమయాజులుగారని' అన్నాడో సంఘసంస్కారప్రియుడు.


## జాతికి పౌరుష ప్రతిభలు కావాలంటే



బలమువుండాలి.
జాతి నిస్తేజమయితే
జాతీయత వుండదు
జీవమువుండదు.
భారతీయులు
బలము పౌరుష ప్రతిభలు
గడించాలి.

అందరికీ సహజముగా బలము వుండదు.
అట్టివారు 'అమృత' సేవించకతప్పదు.
'అమృత' బలమునకు ఆరోగ్యానికి
ఉత్సాహజీవనమునకు పుట్టినదిపేరు.

ఆరోగ్యానికి బలానికి, అమృత.

కేసరి కుటీరం - మద్రాసు

ఏజంట్లు: సీతారాం జనరల్ స్టోర్సు— బెజవాడ